

జలమండలి మేనేజర్ ప్రభాకర్‌కు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్‌లో లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలి

ఫతేనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్‌లో లోప్రెషర్ నీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ జలమండలి అధికారులకు సూచించారు. ఎస్‌పీనగర్, భరత్‌నగర్, జేపీనగర్ తదితర ప్రాంతాలలో లోప్రెషర్ సమస్య ఉందన్నారు. సోమవారం జలమండలి మేనేజర్ ప్రభాకర్‌ను కలిసి సమస్యను వివరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భిక్షపతి, సురేందర్‌నాయుడు, కిరణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

ప్రజావాణికి 10 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 10 ఫిర్యాదులు అందాయి. జడ్సీ అపూర్వ చౌహాన్ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఒకే సమస్యపై పదేపదే వస్తున్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. టౌన్‌ప్లానింగ్, యూబీడీ, శానిటేషన్ సమస్యకు సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్, ఎస్ఈ చిన్నారెడ్డి, టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ సిటీప్లానర్ గణపతి, ఎస్‌డబ్ల్యూఎం డీసీ ఉదయ్‌కుమార్, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభం, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట కిలో. రూ. 11, వంకాయ రూ. 18, బెండకాయ రూ.45, పచ్చి మిర్చి రూ.50, బజ్జీ మిర్చి రూ.23, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, క్యాబేజీ రూ. 10, బీన్స్ రూ. 50, క్యారెట్ రూ. 18, గోబీ పువ్వు రూ. 18, దొండకాయ రూ. 40, చిక్కుడు కాయ రూ. 45, గోరు చిక్కుడు రూ. 35, బీట్‌రూట్ రూ. 15, క్యాంప్సికం రూ. 40, ఆలుగడ్డ రూ. 23, కీర రూ.15, దోసకాయ రూ.23, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, కంద రూ.70, ఉల్లిపొరక రూ.35, ఉల్లిగడ్డ రూ. 24, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ. 45, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ. 30, నిమ్మకాయలు రూ. 50-60, మునగ కాయలు రూ. 6-8, పచ్చిబఠాణి రూ. 50, బొప్పాయి రూ. 40, పుట్టగొడుగులు రూ. 40, ఎండు మిర్చి రూ. 160, అల్లం రూ. 80, వెల్లుల్లి రూ. 140, చింతపండు రూ. 140, పండు మిర్చి రూ. 80, ఉసిరి రూ. 85, కరివేపాకు రూ. 100, పర్వల్ రూ. 60, పల్లీకాయ రూ. 50, లోబా రూ. 25, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు మంగళవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ సమాచారం

పి.నాగేశ్వరరావు, మూసాపేట్ సెక్టార్ ఎస్ఐ - 8712663145
ప్రాంతాలు: రాఘవేంద్రనగర్ సొసైటీ, సేవాలాల్‌తండా, కైత్లాపూర్, అంబేడ్కర్‌నగర్, ములుగు జయభారతి గార్డెన్, పవర్‌నగర్, హబీబ్‌నగర్, శక్తినగర్, ముష్కిపేట్, యాదవబస్తీ, జనతానగర్, ప్రగతినగర్, ఆంజనేయనగర్, గూడ్స్‌షెడ్ రోడ్డు,

పి. రామకృష్ణ, ప్రశాంత్‌నగర్ సెక్టార్ ఎస్ఐ - 8712568115.
ప్రాంతాలు: పాపారాయుడు నగర్, మైత్రినగర్, సాయిబాబానగర్, విజ్ఞానపురి కాలనీ, ఏవీబీ పురం, శ్రీశ్రీనగర్, ప్రశాంత్ నగర్, రాజీవ్‌గాంధీ నగర్, వెంకటేశ్వర నగర్.

పి. రామకృష్ణ, కూకట్‌పల్లి సెక్టార్ ఎస్ఐ - 8712568115.
ప్రాంతాలు: కూకట్‌పల్లి, శాంతినగర్, వెంకట్రావునగర్, సంగీత్ నగర్, దయార్‌గూడ, దేవీనగర్, శ్రీకృష్ణనగర్, ప్రకాష్ నగర్, రామయ్య నగర్, శేషాద్రి నగర్,, బాలకృష్ణ నగర్.

ఎస్.సతీష్‌కుమార్‌రెడ్డి, బాలాజీనగర్ సెక్టార్ ఎస్ఐ- 8712663147.
ప్రాంతాలు: బాలాజీనగర్, న్యూ బాలాజీనగర్, వివేక్‌నగర్, ఐడీఎల్ ఏరియా, ఐడీఎల్ ఫ్యాక్టరీ, కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1 మసీదు

దీక్షిత, వివేకానందనగర్ సెక్టార్ ఎస్ఐ - 8712568329.
ప్రాంతాలు: వీవీ నగర్, ఏఎస్ రాజు నగర్, ఈనాడు కాలనీ, మెడికల్ సొసైటీ, సుమిత్రా నగర్, పటేల్‌కుంట పార్కు, విజయనగర్ కాలనీ.

కె. నరసింహ, భాగ్యనగర్ సెక్టార్ ఎస్ఐ - 9640643483.
ప్రాంతాలు: భాగ్యనగర్ కాలనీ, జయనగర్ కాలనీ, సాయిచరణ్ కాలనీ, మాధవీనగర్ కాలనీ, హెచ్‌ఎంటీ శాతవాహననగర్ కాలనీ, ఇంద్రాహిల్స్, శంషీగూడ విలేజ్, మహంకాళినగర్.

పెట్రోలింగ్-1 బీజేపీ కార్యాలయం వైపు - 8333993410
పెట్రోలింగ్-2 పోలీస్ స్టేషన్ వైపు - 8333993411



అల్లాపూర్‌లో షేక్ ఇమ్రాన్ ఏర్పాటు చేసిన 'ఇఫ్తార్'లో పాల్గొన్న కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు

- అల్లాపూర్, ఆంధ్రజ్యోతి

మద్యం దుకాణానికి వెళ్లొచ్చేసరికి కారు మాయం

పంజాగుట్ట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణానికి వెళ్లి వచ్చేసరికి కారు మాయమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట్ లీలానగర్‌కు చెందిన తోట ప్రసాద్ ఈనెల 16వ తేదీ రాత్రి 8.45 గంటలకు కారులో ఇంటికి బయలుదరాడు. మార్గమధ్యంలో బేగంపేట గ్రీన్ పార్క్ హోటల్ సమీపంలో కారును రోడ్డుపై ఆపి మద్యం కొనుగోలు చేసేందుకు వైన్ షాపుకు వెళ్లాడు. ఇంజిన్‌ను ఆన్‌లోనే ఉంచాడు. మద్యం కొనుగోలు చేసి వచ్చేసరికి కారు కనిపించలేదు. ఆదివారం రాత్రి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు.

'భువన విజయం'లో సమస్యలు

- గ్రౌండ్‌లో చెత్తాచెదారం
- ఊడిపోయిన నేమ్ ప్లేట్స్
- వాకింగ్ ట్రాక్‌లో చిన్నారుల స్కేటింగ్
- ఆట పరికరాలు, టాయిలెట్లు లేని వైనం
- పట్టించుకోని అధికారులు
- మైదానాన్ని ప్రైవేట్ పరం చేసే పనిలో జీహెచ్‌ఎంసీ?



ఊడిపోయిన ఇండోర్ షటిల్ కోర్టు నేమ్ ప్లేట్ అక్షరాలు







వాకింగ్ ట్రాక్‌లో స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ ఫేజ్-1, ఫేజ్-2లో భువన విజయం పేరుతో 2.56 ఎకరాల్లో గ్రౌండ్ ఏర్పాటు చేశారు. ఇందులో రెండు షటిల్ కోర్టులు, ఇండోర్ స్టేడియం ఉన్నాయి. తాజాగా హెచ్‌ఎండీఏ రూ.1.8 కోట్లతో సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ యాంఫీ థియేటర్, క్రికెట్ బాక్స్‌ను అభివృద్ధి చేసింది. చెత్తాచెదారాన్ని అక్కడే వదిలేశారు. గ్రౌండ్‌ను ప్రైవేట్ పరం చేసేందుకు జీహెచ్‌ఎంసీ టెండర్లు ఆహ్వానించే పనిలో ఉందని సమాచారం. గ్రౌండ్ ముఖ ద్వారం వద్ద, ఇండోర్ స్టేడియం నేమ్ ప్లేట్స్ ఊడిపోయినా పట్టించుకునే నాథుడే లేడు. దుమ్ము, ధూళి, చెత్తాచెదారంతో గ్రౌండ్ అపరిశుభ్రంగా ఉంది. వాకింగ్ ట్రాక్‌లో చిన్నారులు స్కేటింగ్ చేస్తుండడంతో వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు, గ్రౌండ్‌లో టాయిలెట్లు లేవు.

- కేపీహెచ్‌బీ కాలనీ, ఆంధ్రజ్యోతి

చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- పలు సంఘాల నాయకుల డిమాండ్



సమావేశంలో అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పంజాగుట్ట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 19న ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు ఎక్కువ నిధులు కేటాయించాలని, ఇప్పటి వరకు దళిత, గిరిజనుల సంక్షేమం కోసం ఎంత ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు.

సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.నర్సింహ, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, పీఎంసీ కన్వీనర్ శివలింగం తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకం స్థానంలో అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి చేతులు దులుపుకుంటున్నారు తప్ప నిధులు విడుదల చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మాల, మాదిగ, ఉపకులాల కార్పొరేషన్లుగా విభజిస్తామని చెప్పారని గుర్తుచేశారు. గత బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమానికి రూ.33,127 కోట్లు కేటాయించగా, కేవలం రూ.9,824 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని, అసైన్డ్ భూములను కాపాడాలని వారు కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదిత ప్రాంతాల పరిశీలన



రోడ్ల నిర్మాణ ప్రాంతాలను పరిశీలిస్తున్న జడ్సీ అపూర్వ చౌహాన్, ఇంజనీరింగ్ అధికారులు

హైదర్‌నగర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఈఈ గోవర్ధన్‌గౌడ్ సోమవారం ఆల్విన్ కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లో పర్యటించారు. ఆల్విన్ కాలనీ, హైదర్‌నగర్ డివిజన్లలో పలు చోట్ల సీసీరోడ్లు నిర్మించేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదించిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ రాజీవ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రాత్రిపూట రోడ్డుపై ఏం చేస్తున్నారన్నందుకు కత్తితో దాడి

బాలానగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట రోడ్డుపై ఏం చేస్తున్నారని అడిగిన వ్యక్తిపై కత్తితో దాడిచేసి పారిపోయాడు ఓ వ్యక్తి. బాలానగర్ చరబండ రాజు కాలనీలో నివసిస్తున్న కోయడ సుమన్ (సెంట్రింగ్ మేస్త్రీ) ఆదివారం రాత్రి పని ముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు. అతడి అన్న కొడుకు నవీన్(18), మంద కౌశిక్ అలియాస్ నాని(20)చరబండ రాజు కాలనీలో హనుమాన్ టెంపుల్ వద్ద చీకట్లో నిలబడి ఉన్నారు. నవీన్‌ను గుర్తించిన సుమన్.. ఇక్కడెందుకున్నావు, ఇంటికి వెళ్దాం రమ్మని పిలిచాడు. నువ్వెవరు నన్ను రమ్మని పిలవడానికి అని నవీన్ అన్నాడు. విజయ్ అనే వ్యక్తి నీ పని చేసుకో అని సుమన్‌ను దుర్భాషలాడాడు. నవీన్ తన అన్న కొడుకు అని, అందుకే రమ్మన్నాను అని చెప్పాడు. నవీన్‌ను తీసుకొని వెళ్తుండగా విజయ్ సుమన్‌ను ఆపి చెంపపై కొట్టి కత్తితో దాడి చేసి పారిపోయాడు. బాధితుడు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రతపై పిల్లలకు అవగాహన

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై పిల్లలకు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ) ప్రత్యేక అవగాహన కల్పిస్తోంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పిల్లలు రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి బోధించనుంది. ఈమేరకు ఎక్స్(ట్విటర్) వేదికగా వివిధ అంశాలతో పోస్టులు చేస్తున్నారు. జీబ్రా లైన్స్ వద్దే రోడ్డు దాటితే భద్రత ఉంటుంది. ఒకరిచేతులు ఒకరు పట్టుకొని రోడ్లపై నడవాలి. సైకిళ్లపై రాకపోకలు సాగించే పిల్లలు భద్రత కోసం హెల్మెట్ పెట్టుకోవాలి. రోడ్డుపై వెళ్తున్నప్పుడు రెండువైపులా చూసి ముందుకు వెళ్లాలని సూచనలు చేశారు. సైబరాబాద్ పరిధిలో ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధి తెలిపారు.

మద్యం మత్తులో కార్మికుడి ఆత్మహత్య

బాలానగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బాలానగర్ గురుమూర్తినగర్‌లో నివసిస్తున్న జక్క సత్యన్నారాయణ(49) ఓ ప్రైవేట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు. సత్యన్నారాయణ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం భార్య లత వద్ద డబ్బులు తీసుకొని మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో మాట్లాడకుండా స్టోర్ రూమ్‌లోకి వెళ్లాడు. ఎంతసేపైనా బయటకు రాకపోవడంతో భార్య కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందకు దించి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న చైన్‌మెన్లపై చర్యలు తీసుకోవాలి

బేగంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్, బేగంపేట సర్కిళ్లలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న చైన్‌మెన్లపై చర్యలు తీసుకోవాలని దళిత చైతన్య సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బేగంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. బేగంపేటలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని, ఇందుకు టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న చైన్‌మెన్‌లే కారణమని ఆరోపించారు. ఎక్కడెక్కడ భవన నిర్మాణాలు జరుగుతున్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన చైన్‌మెన్లు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నారన్నారు. నిర్మాణదారులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకుని అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఒకేచోట ఏళ్లతరబడి విధులు నిర్వహిస్తున్న వారిని వెంటనే బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

స్మార్ట్ ఫోన్ ఉంటేనే ఎంసీహెచ్‌లోకి అనుమతి

- 'అభ' నంబర్ చెబితేనే ఓపీ చీటీ
- గాంధీ మదర్ చైల్డ్ ఆస్పత్రిలో గర్భిణుల అవస్థలు

అడ్డగుట్ట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి ఓపీ భవనం వెనుక వైపు ఉన్న మదర్ చైల్డ్ ఆస్పత్రి(ఎంసీహెచ్)లో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారంలో ఆరు రోజులు సేవలందిస్తున్న ఎంసీహెచ్ భవన్‌కు వచ్చే గర్భిణులకు అవస్థలు తప్పడం లేదు. ఓపీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే స్మార్ట్ ఫోన్ తప్పనిసరి చేశారు. స్మార్ట్ ఫోన్ లేకపోతే ఆస్పత్రి లోపలికి అనుమతించడం లేదు. ఓపీ కౌంటర్ బయట అతికించిన క్యూఆర్ కోడ్ స్టికర్‌ను గర్భిణులు స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయాలి. అనంతరం 'అభ'(ఏబీహెచ్‌ఏ) హెల్త్ కార్డు (ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు)పై క్లిక్ చేసి ఫోన్ నంబర్ లేదా 'అభ' హెల్త్ కార్డు నంబర్‌తో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి తరువాత క్లిక్ చేయాలి. వచ్చిన ఓటీపీ ఎంటర్ చేసి తరువాత క్లిక్ చేయాలి. అనంతరం డిస్‌ప్లే అయిన 'అభ' హెల్త్ కార్డును డౌన్‌లోడ్ లేదా ప్రింట్ తీసుకోవచ్చు. కార్డుపై ఉన్న నంబరు ఓపీలో చెబితే గర్భిణులకు ఓపీ చీటీ ఇస్తారు.

ప్రతీరోజూ వివిధ జిల్లాలతోపాటు నగరం నలుమూలల నుంచి దాదాపు 120 మంది గర్భిణులు వైద్య పరీక్షల కోసం ఎంసీహెచ్‌కు వస్తుంటారు. ఒక్కొక్కరికి అభ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవడానికి దాదాపు 20 నిమిషాలు పడుతోంది. చిన్న కీ ప్యాడ్ ఫోన్ తెచ్చుకున్న, ఫోన్ తీసుకురాని గర్భిణులకు ఓపీ చీటీ ఇవ్వడం లేదు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కేవలం 40 మంది గర్భిణులు మాత్రమే 'అభ' కార్డు నంబర్ చెప్పి ఓపీ చీటీ తీసుకుని వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



మదర్ చైల్డ్ ఆస్పత్రి భవనం



ఓపీ సెంటర్‌లో క్యూఆర్ కోడ్ వద్ద నిరీక్షిస్తున్న గర్భిణులు

పరిశుభ్రతతో అనారోగ్యం దూరం : కార్పొరేటర్

హైదర్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇల్లు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాలు దరిచేరవని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మ బండలో శానిటేషన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు పారిశుధ్య సిబ్బందితో కలిసి పరిసరాల పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి ఒకసారైనా తమ ఇంటి పరిసరాల్లో నిల్వవున్న నీటిని, చెత్తను తొలగించుకోవాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని, చెత్త సేకరించే కార్మికులకు అందజేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని, అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, పాండుగౌడ్, శ్రీనివాస్, షౌకత్ అలీమున్నా, సయ్యద్, నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి, సౌందర్య, దేవి, జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రత అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది

ఆర్ఓబీ ఎప్పటికయ్యేనో..?





ఆర్ఓబీ వద్ద జరుగుతున్న పనులు

- లింగంపల్లి ఆర్ఓబీ వద్ద పనుల్లో అధికారుల నిర్లక్ష్యం
- గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌తో నిత్యం నరకం చూస్తున్న ప్రయాణికులు


గచ్చిబౌలి, మార్చి17, (ఆంధ్రజ్యోతి): బ్రిడ్జి వద్ద కొద్దిపాటి స్లాబ్ వేస్తే పూర్తయ్యే పనులను అధికారులు నెలలపాటు కాలయాపన చేస్తూ ప్రయాణికుల ఇబ్బందులకు కారణమవుతున్నారు. చినుకు పడితే చాలు.. వరద నీటితో నిండిపోయే లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జివద్ద కొన్ని సంవత్సరాలుగా తీవ్రమైన సమస్య ఉంది. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు, ఐటీ ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం. ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాలనే ఉద్దేశ్యంతో రెండేళ్ల క్రితం రూ.4 కోట్లతో కల్వర్టు ఏర్పాటు, నాలా నిర్మాణం, వ్యర్థాల తొలగింపు తదితర పనులను ప్రారంభించారు. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు నత్త నడకన కొనసాగుతున్నాయి. బ్రిడ్జి పనులు ప్రారంభంలో చందానగర్ సర్కిల్ అధికారుల పర్యవేక్షణలో జరగగా, మధ్యలో శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులకు బదిలీ చేశారు. ప్రస్తుతం శేరిలింగంపల్లి అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నట్లు తెలిసింది. నిత్యం ఈ దారి గుండా వేలాది మంది ఐటీ ఉద్యోగులు, పరిసర ప్రాంత ప్రజలు నిత్యం లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి రహదారిని వినియోగించుకుంటారు. ఇక్కడ పనుల కారణంగా ఏడాదిగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు జరుగుతున్న సమయంలో ఒక్కోసారి రహదారి గుండా రాకపోకలను పూర్తిగా నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గత నెల రోజుల వరకు రహదారిని పూర్తిగా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు మార్లు పత్రికలో వచ్చిన కథనాలతో తాత్కాలికంగా ఓ పక్కనుంచి రోడ్డును కొంత మేర పునరుద్ధరించారు. మరోవైపు రహదారిని పూర్తిగా నిలిపివేశారు. పనులు దాదాపు చివరి దశకు వచ్చినా, అండర్ బ్రిడ్జి వద్ద కొద్దిపాటి స్లాబ్ వేస్తే పూర్తికావచ్చే పనులను మూడు నెలలుగా నిలిపివేశారు.

మరో 20 రోజుల్లో పూర్తిచేస్తాం

పనులు మొదటి నుంచి కొంత సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమయిన మాట వాస్తవమే. మొదట్లో చందానగర్ సర్కిల్ అధికారుల పర్యవేక్షణలో పనులు జరిగాయి. కొద్దిపాటి పనులు మిగిలి పోయాయి. అవి కూడా మరో 20 రోజుల్లో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

- డీఈ ఆనంద్, శేరిలింగంపల్లి సర్కిల్

అధికారుల నిర్లక్ష్యం వల్లే జాప్యం



లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న సమస్యను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. నిపుణులైన ఇంజనీర్లు చిన్న సమస్యను పరిష్కరించడంలో మల్లగుల్లాలు పడుతున్నారు. ఇదే ప్రాంతంలో పెద్ద వంతెన నిర్మించాల్సి వస్తే పరిస్థితి ఏమిటని ప్రజలు అనుకుంటున్నారు. ప్రతీ వర్షాకాలంలో సమస్య వస్తుంది. దానిని కూడా పరిష్కరించకపోతే ఇక ఇంజనీర్లు ఎందుకు.

- మాజీ కౌన్సిలర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, లింగంపల్లి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

ప్రజావాణికి ఫిర్యాదుల వెలువ

చందానగర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని చందానగర్ సర్కిల్-21 ఉప కమిషనర్ పి.మోహన్‌రెడ్డి అన్నారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని మాదాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, చందానగర్ నాలుగు డివిజన్లు నుంచి ప్రజలు ఫిర్యాదు చేశారు. టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి 2, శానిటేషన్ 1, రెవెన్యూ కు సంబంధించి ఒక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ప్రత్యేక దృష్టితో చూస్తామన్నారు. వాటిపరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామన్నారు.



సమస్యలపై వాటర్‌వర్క్స్ అధికారులకు ఫిర్యాదుచేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

ప్రజా పాలనకు నిదర్శనం ప్రజావాణి : జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనకు నిదర్శనం ప్రజావాణి అని, ఈ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను సత్వరమే అధికారులు పరిష్కరిస్తారని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం హఫీజ్‌పేటలోని హెచ్ఎండబ్ల్యుఎస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో నియోజకవర్గంలోని గచ్చిబౌలి, కొండాపూర్, లింగంపల్లి, హఫీజ్‌పేట, మాదాపూర్ డివిజన్లలో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన మంజీర, డ్రైనేజీ పైపులైను పనులపై జీఎం, డీజీఎం ఇతర అధికారులను కలిసి సమీక్ష నిర్వహించారు.

నేడు వాహనాల వేలం

చందానగర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం పలు వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనవచ్చని శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. మాదకద్రవ్యాల తరలింపు కేసుల్లో పట్టుబడిన 18 వివిధ రకాల వాహనాల వేలం పాట ఉంటుందని, ఇందులో పాల్గొనేవారు 25 శాతం బెడ్ గా సమర్పించి వేలంలో పాల్గొనాలని లక్ష్మణ్‌గౌడ్ సూచించారు. వేలంలో దక్కించుకున్న తరువాత మిగిలిన 75 శాతం రూపాయలను ఎక్సైజ్ పోలీసులకు చెల్లించాలని సూచించారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

హైదర్‌నగర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డు సెవెన్‌హిల్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు మంగళవారం జరుగనున్నట్లు ఆలయ ఈవో వీఎస్‌వీ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం దేవస్థానం ప్రాంగణంలో ఉదయం 10.30నుండి ప్రారంభమౌతుందని భక్తులు ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : ఎంఈఓ

గచ్చిబౌలి, మార్చి17, (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలంలో ఈనెల 21 వ తేదీ నుంచి జరుగనున్న పదవ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులుమొత్తం 6,090 మంది పరీక్షలు రాస్తున్నారని, వారికి ఇప్పటికే హాల్ టికెట్లు పంపిణీ చేశామని అన్నారు. పరీక్షల నిర్వహణ కోసం సుమారు 1400 మంది సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ప్రతి పరీక్ష హాలులో సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను ఒక రోజు ముందుగానే వెళ్లి చూసుకోవాలని సూచించారు. పరీక్షలకు ఐదు నిమిషాల వరకు ఆలస్యం అయినా అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయడం జరుగుతుందని కేంద్రానికి సుమారు 500 మీటర్ల దూరం వరకు ఎవరికీ అనుమతి ఉండదని అన్నారు.

రోడ్డు భద్రతపై పిల్లలకు అవగాహన

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై పిల్లలకు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ) ప్రత్యేక అవగాహన కల్పిస్తోంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పిల్లలు రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి బోధించనుంది. ఈమేరకు ఎక్స్ (ట్విటర్) వేదికగా వివిధ అంశాలతో పోస్టులు చేస్తున్నారు. జీబ్రా లైన్స్ వద్దే రోడ్డు దాటితే భద్రత ఉంటుంది. ఒకరిచేతులు ఒకరు పట్టుకొని రోడ్లపై నడవాలి. సైకిళ్లపై రాకపోకలు సాగించే పిల్లలు భద్రత కోసం హెల్మెట్ పెట్టుకోవాలి. రోడ్డుపై వెళ్తున్నప్పుడు రెండువైపులా చూసి ముందుకు వెళ్లాలని సూచనలు చేశారు. సైబరాబాద్ పరిధిలో ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధి తెలిపారు.



శేరిలింగంపల్లి ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట ఎంఆర్‌పీఎస్ నిరసన దీక్షలు

అసెంబ్లీలోనే ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకురావాలి

గచ్చిబౌలి, మార్చి 17, (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు మండల ఎంఆర్‌పీఎస్ నిరసన దీక్షలు చేపట్టింది. కార్యక్రమంలో మండల ఆ పార్టీ నాయకులు నరేష్, నగేష్, గణేష్, సుధాకర్, రాజేష్, వినోద్, సతీష్, రాజు తదితరులు నిరసన దీక్షలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్గీకరణపై ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు హామీలిచ్చి మర్చిపోతాయని అన్నారు. ఈసారి చట్టం చేసేంతవరకు ఊరుకునే ప్రసక్తే లేదని అప్పటి వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తా: శ్రీకాంత్



కార్పొరేటర్ శ్రీకాంత్‌ను కలిసిన సభ్యులు

మియాపూర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలోని కోకనట్ గ్రో అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నుకోబడిన అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ సభ్యులను కార్పొరేటర్ అభినందించారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కోకనట్ గ్రో అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వివేకానందరెడ్డి, గంగరాజుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి,మిథిలా తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలోని బౌల్డర్ హిల్స్‌లో జరిగిన పోటీల్లో అవార్డు అందుకుంటున్న చిన్నబాబు

ఉత్తమ గోల్ఫర్లుగా చిన్నబాబు, కవిత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): శ్రీ ఆదిత్య గోల్ఫ్ పోటీల్లో ఉత్తమ గోల్ఫర్లుగా చిన్నబాబు, కవిత నిలిచారు. సోమవారం గచ్చిబౌలిలోని బౌల్డర్ హిల్స్‌లో జరిగిన ఈ పోటీల్లో 150 మందికి పైగా గోల్ఫర్లు పాల్గొన్నారు. ఇందులో ఉత్తమ క్లోసెస్ట్ పిన్‌ను వి.రాజు, లాంగెస్ట్ డ్రైవ్‌ను రమాదేవి, స్ట్రయిట్ డ్రైవ్‌ను రమేష్ కొట్టారు. మొత్తంగా అన్ని విభాగాల్లో కలిపి చిన్నబాబు, కవిత ఉత్తమ ప్లేయర్లుగా నిలిచారు. వీరికి శ్రీ ఆదిత్య సంస్థ ఎండీ కోటారెడ్డి, ఈడీ ఆదిత్య రెడ్డి కలిసి ట్రోఫీలు ప్రదానం చేశారు.

ఓర్వలేకే ఫ్లెక్సీల తొలగింపు

నార్నెపై బీఆర్ఎస్ నాయకుడు శ్రీకాంత్ ఆరోపణలు

హైదర్‌నగర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులకు ఇఫ్తార్ విందు సందర్భంగా ఓర్వలేక తమ ఫ్లెక్సీలను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తొలగింపజేశారని సిందం శ్రీకాంత్ మండిపడ్డారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు హైదర్‌నగర్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి వేల సంఖ్యలో ప్రజలు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఇదిచూసి ఓర్వలేక, కార్పొరేటర్ శ్రీనివాసరావు అధికారుల మీద ఒత్తిడి తీసుకొచ్చి ఫ్లెక్సీలను తొలగించారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ, ఇదే కార్పొరేటర్ జన్మదినం సందర్భంగా అడ్డగుట్టలోని తన ఇంటి దగ్గర ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు నెలరోజులయినా అధికారులు తొలగించలేదని, ఈ విధంగా అధికార పార్టీ నాయకులకు జీహెచ్ఎంసీ సిబ్బంది వత్తాసు పలకడం సరికాదన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఫ్లెక్సీలు తీయించడం శ్రీనివాసరావుకు తగదన్నారు. కార్పొరేటర్ టికెట్ ఇచ్చి రాజకీయ భిక్షపెట్టిన బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలను తీయించి వేయడం దుర్మార్గమని ఇది ఆయనకు తగదని ఆరోపించారు. అందుకు రాబోయే రోజుల్లో కార్పొరేటర్‌కి రాజకీయ సన్యాసం తప్పదని, ఆయనకు సరైన సమయంలో సరైన విధంగా ప్రజలు బుద్ధిచెప్తారని శ్రీకాంత్ హెచ్చరించారు.

పరిశుభ్రతతోనే అనారోగ్యం దూరం : వెంకటేష్‌గౌడ్



పరిసరాల పరిశుభ్రత అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది

హైదర్‌నగర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): ఇల్లు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాలు దరిచేరవని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మ బండలో శానిటేషన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు పారిశుధ్య సిబ్బందితో కలిసి పరిసరాల పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ హాజరై ర్యాలీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి ఒకసారైనా తమ ఇంటి పరిసరాల్లో నిల్వవున్న నీటిని, చెత్తను తొలగించుకోవాలన్నారు. అదేవిధంగా చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా తడి,పొడి చెత్తను వేరుచేసి చెత్త సేకరించే ఆటో కార్మికులకు అందజేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని, అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, పాండుగౌడ్, శ్రీనివాస్, షౌకత్‌అలీ మున్నా, సయ్యద్, నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి, సౌందర్య, దేవి, జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంసీ ఎన్‌క్లేవ్ సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, మార్చి17(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి మసీద్‌బండలోని సీఎంసీ ఎన్‌క్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సోమవారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే కాలనీలో చేయాల్సిన అభివృద్ధి పనులను పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. త్వరలోనే అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి స్వయంగా సమస్యలను పరిశీలిస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వారికి హామీ ఇచ్చారు.



ఆరెకపూడి గాంధీకి వినతి పత్రం అందిస్తున్న సీఎంసీ ఎన్‌క్లేవ్ అసోసియేషన్ ప్రతినిధులు

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదిత ప్రాంతాల పరిశీలన

హైదర్‌నగర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఈఈ గోవర్ధన్‌గౌడ్ సోమవారం ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లో పర్యటించారు. ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్లలో పలుచోట్ల సీసీరోడ్లు నిర్మించేందుకు నూతనంగా ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదించిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆ పనులు ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటిలో ముఖ్యంగా ఇప్పటికప్పుడు యుద్ధప్రాతిపదికన ఏ యే పనులకు నిధులు కేటాయించాలనే విషయమై ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ రాజీవ్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న జడ్‌సీ అపూర్వ చౌహాన్, ఇంజనీరింగ్ అధికారులు

లక్ష్మీగణపతికి పూజలు

చందానగర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): చందానగర్ శిల్పా ఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి దేవాలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన కార్యక్రమంలో భాగంగా సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, అర్చనలు, హోమం అనంతరం పుష్పాలంకరణ చేశారు. సిద్ధి, బుద్ధి సమేత గణపతిస్వామికి ఆగమన శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మురళీధర్‌శర్మ మాట్లాడుతూ, భక్తిభావం గల వారు క్రమశిక్షణకు నిలయంగా ఉంటారని అన్నారు. భగవంతునికి నిత్య పూజ, ధ్యానం చేస్తే శుభం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ యు.వి. రమణ మూర్తి, కమిటీ సభ్యులు, అర్చక బృందం పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పాత గోడలు తొలగించి సీసీ వేయించిన దృశ్యం

కల్వర్టు పాత గోడల తొలగింపు

కుత్బుల్లాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం నుంచి కుత్బుల్లాపూర్ గ్రామం వైపు వెళ్లే రోడ్డును విస్తరణ పేరుతో గతంలో పనులు ప్రారంభించి పూర్తి చేశారు. అయితే మధ్యలో ఉన్న కల్వర్టును విస్తరించినప్పటికీ పాత కల్వర్టు గోడలు తొలగించకపోవడంతో ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానికుల సమాచారం మేరకు ఈ నెల 13న ప్రమాదకరంగా కల్వర్టు గోడలు, సంవత్సరాలు గడుస్తున్నా.. పూర్తి కాని పనులు శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కుత్బుల్లాపూర్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. సోమవారం పాత గోడలను తొలగించడంతో పాటు పూర్తి చేయకుండా వదిలేసి ప్రాంతంలో సీసీ వేయించారు. సమస్యను పరిష్కరించడంతో పాటు ప్రమాదాల నివారణ కోసం చొరవ చూపిన 'ఆంధ్రజ్యోతి'కి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

బారికేడ్ తొలగించిన పోలీసులు



ఒరిగిన బారికేడ్‌ను తొలగించిన దృశ్యం

కుత్బుల్లాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం సర్కిల్ పరిధి షాపూర్‌నగర్‌లోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ బస్టాండ్ ముందు ఏర్పాటు చేసిన బారికేడ్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో పక్కకు ఒరిగింది. దీంతో ఆ దారిన వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ బారికేడ్ ప్రమాదకరం అనే శీర్షికన 9న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ట్రాఫిక్ పోలీసులు సోమవారం సదరు బారికేడ్‌ను తొలగించారు. సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన ఆంధ్రజ్యోతికి, స్పందించిన ట్రాఫిక్ పోలీసులకు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న శ్రీశైలంగౌడ్

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : కూన

షాపూర్‌నగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారి షాపూర్‌నగర్‌లోని తన నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రజలు, నాయకులను వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న సమస్యలను సత్వరంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జేఈటీఎల్ రోడ్డుపైనే భారీ వాహనాల పార్కింగ్

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

- జేఈటీఎల్ రోడ్డులో భారీ వాహనాలతో స్తంభిస్తున్న ట్రాఫిక్
- నియంత్రించడంలో విఫలమవుతున్న ట్రాఫిక్ పోలీసులు

జీడిమెట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలో స్టీల్ కంపెనీల వద్ద లారీల అక్రమ పార్కింగ్‌తో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నడిరోడ్డు పైనే భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జేఈటీఎల్, వాణి కెమికల్స్ రోడ్డు, ఆజాద్ పరిశ్రమ ముందు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పారిశ్రామికవేత్తలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు భారీ వాహనాలను పార్కింగ్ చేస్తున్న స్టీల్ కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్న భారీ వాహనాలను నియంత్రించకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

పొల్యూషన్ నుంచి ప్రజలను కాపాడాలి

- శాసనమండలిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల నుంచి కొన్ని నెలలుగా పొల్యూషన్ వెలువడుతుండటంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, నివారణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శాసనమండలిలో ప్రసంగించారు. పొల్యూషన్‌తో గాలి కాలుష్యమై బాచుపల్లి, నిజాంపేట, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల ప్రాంతాల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాంకీలో శ్రీకాకుళం పరివాడ పారిశ్రామికవాడల నుంచి వ్యర్థ రసాయనాలను తీసుకువచ్చి రాంకీలో డ్రిల్ చేసి లోపలికి వదులుతున్నట్లు తెలిసిందని, దానిని నివారించాలని కోరారు. గత ప్రభుత్వం భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఫార్మాసిటీ కోసం స్థలాన్ని కేటాయించిందని, ఒకవేళ ఫార్మాసిటీ రాకుంటే రైతులకు భూములను ఇస్తామని అప్పట్లో చెప్పడం జరిగిందన్నారు. ఆ స్థలంలోకి పరిశ్రమలను తరలిస్తారా..? రైతులకు ఇస్తారా..? అని అడిగారు.



శాసనమండలిలో మాట్లాడుతున్న శంభీపూర్ రాజు

ట్యాంకర్లు పక్కదారి

- జీడిమెట్లలో జోరుగా సాగుతున్న తాగునీటి వ్యాపారం
- పరిశ్రమలకు యథేచ్ఛగా సరఫరా
- పట్టించుకోని అధికారులు

జీడిమెట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తాగునీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. అసలే వేసవి కాలం, భూగర్భ జలాలు పాతాళానికి వెళ్లిపోవడంతో బోర్లు ఎండిపోయాయి. వాటర్‌వర్క్స్ విభాగం కొన్ని ప్రాంతాల్లో ఐదురోజులకొకసారి తాగునీటిని సరఫరా చేస్తుంది. దీంతో బస్తీలు, కాలనీల్లోని ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు సరఫరా చేయాల్సిన నీటిని వాటర్ వర్క్స్ అధికారులు కొందరు అక్రమంగా పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం కమర్షియల్, డొమెస్టిక్ విభాగాలు విడగొట్టి మంచినీటిని సరఫరా చేయాలి. జీడిమెట్ల పారిశ్రామికవాడలో ఉన్న వాటర్‌ట్యాంక్‌ల వద్ద పెద్దఎత్తున నీటి వ్యాపారం సాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు సిబ్బంది నీటిని జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు దర్జాగా విక్రయిస్తున్నారు. సామాన్య ప్రజలు మంచినీటి ట్యాంకర్ కావాలంటే బుక్ చేసుకోవాలని నిబంధనలు ఉన్నాయి. కానీ వాటర్ వర్క్స్ సిబ్బంది అడ్డదారుల్లో పరిశ్రమలకు అమ్మకాలు సాగిస్తున్నారు. వాణి కెమికల్స్, దీపక్ నైట్రేట్ పరిశ్రమల సమీపంలో ఉన్న రెండు ఫిల్లింగ్ పాయింట్ల వద్ద జోరుగా ఈ దందా సాగుతోందని వినికిడి. పారిశ్రామికవాడల్లోని కొన్ని పరిశ్రమలతో వాటర్‌వర్క్స్ సిబ్బంది ఒప్పందాలు చేసుకుని నెలవారి బిల్లులు తీసుకుంటూ తాగునీటిని విక్రయిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. దీనిపై నిఘా పెట్టాల్సిన విజిలెన్స్, ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతోనే ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది. ఈ తాగునీటి వ్యాపారంలో స్థానిక ఉన్నతాధికారుల అండదండలు కూడా సిబ్బందికి పుష్కలంగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్యాంకర్ యాజమాన్యాలు, సిబ్బంది, అధికారులు సాగిస్తున్న ఈ అక్రమ నీటి వ్యాపారానికి తెరపడాల్సిన అవసరం ఉంది.



జీడిమెట్లలో వాటర్ ట్యాంక్ వద్ద మంచినీటిని నింపుకుంటున్న ట్యాంకర్

బల్క్ కనెక్షన్ ముసుగులో..

జీడిమెట్లలోని ఓ పరిశ్రమ అవసరాలకు బల్క్ కనెక్షన్ తీసుకుని అడ్డదారుల్లో నీటి వ్యాపారం సాగిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైప్‌లైన్ రోడ్డులో ఈ నీటి దందా కొనసాగుతుంది. గతంలో ఉన్న పరిశ్రమల ఆవరణలోనే ఈ వ్యవహారమంతా జరుగుతోంది. అయితే నిబంధనల ప్రకారం ఈ పరిశ్రమకు మాత్రమే నీటిని సరఫరా చేయాల్సి ఉన్నా, భారీ ట్యాంకర్లతో బయట నీటిని విక్రయిస్తున్నారు. వాటర్ వర్క్స్ సిబ్బంది, అధికారులకు ఈ విషయం తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదనేది ప్రశ్నార్థకం. ఉన్నతాధికారులు దీనిపై నిఘా పెట్టాల్సి ఉంది.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదులపై అధికారులతో చర్చిస్తున్న డీసీ మల్లారెడ్డి



కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

కుత్బుల్లాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో సోమవారం జరిగిన ప్రజావాణిలో సమస్యలను పరిష్కరించాలని పలువురు ప్రజలు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఇంజనీరింగ్ విభాగానికి 2, టౌన్ ప్లానింగ్‌కు 4, పన్నుల విషయంపై 1, పారిశుధ్య విభాగానికి 1 దరఖాస్తు వచ్చినట్లు డీసీ నర్సింహ తెలిపారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో ఇంజనీరింగ్‌కు 4, విద్యుత్‌కు 2 ఫిర్యాదులు వచ్చాయని డీసీ మల్లారెడ్డి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని డీసీలు తెలిపారు.

గాజులరామారం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ మండలంలో ప్రభుత్వ భూముల కబ్జాల నుంచి కాపాడాలని సీపీఐ నాయకులు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ గౌతంపోట్రుకు వినతిపత్రం అందజేశారు. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, స్వయాన ముఖ్యమంత్రి కబ్జాల చెర నుంచి ఆ భూములను కాపాడతామని చెప్పారని, కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. దీనివల్ల సర్వే నంబర్ 307, 326, 342, 329లో కబ్జాలు జరిగాయని తెలిపారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రభుత్వ భూముల చుట్టు ఫెన్సింగ్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ఉమామహేష్, స్వామి, నర్సింహారెడ్డి, సదానంద్, బాబు, ఇమామ్, జంబులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

నిజాంపేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేటలో అఖిల భారత వడ్డెర సంఘం కమ్యూనిటీ హాల్‌కు స్థలాన్ని కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు దండగల ఎల్లస్వామి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఐదువేల వడ్డెర కులస్థులు నివసిస్తున్నా.. కమ్యూనిటీ హాల్ లేక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మినీ స్టేడియానికి స్థలం కేటాయించాలి

నిజాంపేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట కార్పొరేషన్‌లో జనాభాకు అనుగుణంగా మినీ స్టేడియం కోసం ఐదెకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఆకుల సతీష్ బృందం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్ పరిధిలో దాదాపు నాలుగు లక్షలకు పైగా జనాభా ఉన్నారు. సెలవు రోజుల్లో పిల్లలు, పెద్దలు, క్రీడాకారులు ఆడుకోవడానికి, శారీరక వ్యాయామం కోసం ఎలాంటి స్థలం లేదు. వీటిని పెట్టుకుని ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 334, 186లలో స్థలం అనుకూలంగా ఉన్నదని, ఆ స్థలంలో కేటాయించే విధంగా చూడాలని విన్నవించుకున్నారు.

ఫామ్‌హౌజ్‌లను తొలగించాలి

దుండిగల్‌లోని సర్వే నంబర్ 453, 454ల్లో లావణ్య పట్టా భూముల్లో అక్రమంగా గెస్ట్‌హౌజ్ నిర్మించిన వారిపై గతంలో నామమాత్రపు చర్యలు తీసుకున్నారని, వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. గెస్ట్‌హౌజ్‌లను తక్షణమే తొలగించి 15 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బౌరంపేట సర్వే నంబర్ 166/9 సరైన ఎన్‌ఓసీ లేకుండా 166/1 చెరువు వద్ద ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడంపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వభూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోకుండా 166లో చిన్న చిన్న రైతులు వ్యవసాయ అవసరాలకు నిర్మిస్తే నోటీసులు ఇచ్చిన దుండిగల్ తహసీల్దార్ ద్వంద్వ వైఖరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో అమలేశ్వరి, అరుణ్‌కుమార్, ఎల్లస్వామి, ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.



మినీ స్టేడియానికి స్థలం కేటాయించాలని అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆకుల సతీష్



బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

ఎండలో బస్సుల కోసం నిరీక్షణ

దుండిగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలు 12 గంటలకు ముగియగానే బస్సుల కోసం విద్యార్థినీ, విద్యార్థులు బహదూర్‌పల్లిలోని జూనియర్ కళాశాల ముందు ఉన్న బస్టాపుల్లో ఎండలోనే బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. పెరిగిన ఎండల తీవ్రతకు తప్పని పరిస్థితిలో పరీక్ష ప్యాడ్‌లు, చున్నీలను అడ్డుగా పెట్టుకుని నీడ చేసుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పరీక్షలు ముగియగానే ప్రత్యేకంగా బస్సులను నడపాలని విద్యార్థులు కోరుతున్నారు.



వేదికపై విద్యార్థుల ఆట, పాట

ఇంజనీరింగ్ కళాశాలలో సాంస్కృతికోత్సవాలు

నిజాంపేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : బాచుపల్లిలోని వీఎన్‌ఆర్‌వీజేఐఈటీలో రెండు రోజులపాటు జరగనున్న సింటిలేషన్ - 2025 సాంస్కృతికోత్సవం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు చలనచిత్ర నిర్మాత సాహు గారపాటి, గౌరవ అతిథిగా తెలుగు చలనచిత్ర నృత్య దర్శకురాలు అనీ మాస్టర్లు హాజరయ్యారు. కళాశాల పూర్వ విద్యార్థి అయిన సాహు మాట్లాడుతూ ఈ సన్నాహాలు చూస్తుంటే పాతికేళ్ల క్రితం ఇదే కళాశాలలో తాను విద్యార్థిగా నిర్వహించిన ఫెస్ట్ గుర్తుకు వస్తుందన్నారు. విద్యార్థులు తమలోని కళలను మెరుగుపర్చుకోవడానికి కళాశాల దశ ఎంతో దోహదపడుతుందని, దానిని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. గౌరవ అతిథి అనీ మాస్టర్ మాట్లాడుతూ ప్రయత్నం చేయకుంటే గెలుపు దరిచేరదని చెబుతూ పాఠ్యేతర రంగాల్లో ఆసక్తి ఉన్నవారు ఓటమికి భయపడకుండా కృషి చేయాలన్నారు. ఈ ఫెస్ట్ ప్రారంభోత్సవంలో ప్రధాన అధ్యాపకులు డా.సీడీ నాయుడు, డీన్ వై.పద్మసాయి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని సంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు.

మొరాయించిన సిగ్నల్.. నిలిచిన ట్రాఫిక్



డివైడర్ పక్కగా రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనదారుడు

- క్లియర్ చేసిన ట్రాఫిక్ పోలీసులు

దుండిగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లి సిగ్నల్ వద్ద ఇటు గండి మైసమ్మ, అటు బహదూర్‌పల్లి, బౌరంపేట, మరోవైపు బాలానగర్ నాలుగు దిక్కులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఈ రోజు గంటల కొద్దీ వాహనదారులు మండుటెండలో చిక్కుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ సిబ్బందితో రంగంలోకి దిగారు. ట్రాఫిక్‌ను నిమిషాల వ్యవధిలో క్లియర్ చేశారు. బహదూర్‌పల్లి సిగ్నల్ వద్ద ట్రాఫిక్ జామ్ కావడం వల్ల వాహనదారులు డివైడర్ మీద నుంచి రోడ్డు మీదకు వెళ్లాల్సి వచ్చింది. మరికొందరు రాంగ్ రూట్‌లో వాహనాలను మలుపుకుని వెళ్లిపోయారు. పోలీసులు సకాలంలో వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేయడం వల్ల వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.



మండుటెండలో చిక్కుకున్న వాహనదారులు



బహదూర్‌పల్లి సిగ్నల్ వద్ద ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న సీఐ శ్రీనివాస్



ట్రాఫిక్ మళ్లింపునకు పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్లు

పైపులైన్ పనులు.. ట్రాఫిక్ మళ్లింపు

పేట్‌బషీరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): షాపూర్‌నగర్ రంగా భుజంగా థియేటర్స్ నుంచి ఎన్‌హెచ్-44కు వెళ్ళే పైపులైను రోడ్డులో పైపులైను పనులు జరుగుతున్నాయి. దీంతో ఈ రహదారి గుండా రాకపోకలు సాగించడం కష్టతరంగా మారింది. దీంతో షాపూర్‌నగర్ ప్రధాన రహదారి దగ్గర పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో షాపూర్‌నగర్ సాగర్ హోటల్ ఎదురు రోడ్డు సుభాష్‌నగర్ రోడ్డు గుండా మళ్ళించారు. వాహనదారులు షాపూర్‌నగర్, అయోధ్యనగర్, కుత్బుల్లాపూర్ మీదుగా సుచిత్రా రోడ్డుకు వెళ్ళవచ్చు. బారికేడ్ల ఏర్పాటు విషయం తెలియనివారు వెనుతిరిగి వెళ్ళా ల్సి వస్తోందని, కనుక గమనించి ముందుకు వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.

రోడ్డు భద్రతపై పిల్లలకు అవగాహన

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై పిల్లలకు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ) ప్రత్యేక అవగాహన కల్పిస్తోంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పిల్లలు రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి బోధించనుంది. ఈమేరకు ఎక్స్(ట్విటర్) వేదికగా వివిధ అంశాలతో పోస్టులు చేస్తున్నారు. జీబ్రా లైన్స్ వద్దే రోడ్డు దాటితే భద్రత ఉంటుంది. ఒకరిచేతులు ఒకరు పట్టుకొని రోడ్లపై నడవాలి. సైకిళ్లపై రాకపోకలు సాగించే పిల్లలు భద్రత కోసం హెల్మెట్ పెట్టుకోవాలి. రోడ్డుపై వెళ్తున్నప్పుడు రెండువైపులా చూసి ముందుకు వెళ్లాలని సూచనలు చేశారు. సైబరాబాద్ పరిధిలో ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధి తెలిపారు.



పాత నేరస్థుడిని బైండోవర్ చేస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

పాత నేరస్థుడి బైండోవర్

- బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ పాత నేరస్థుడిని బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు సోమవారం బైండోవర్ చేశారు. స్పెషల్ మెజిస్ట్రేట్ అధికారాలను వినియోగించి కొత్త చట్టం బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 131 ప్రకారం పాత నేరస్థుడు పెంట టాటాబాబును బైండోవర్ చేశారు. 50వేల పూచికత్తు, అతని బంధువుల దగ్గర నుంచి సత్ప్రవర్తన కోసం బాండ్‌ను తీసుకున్నారు. జగద్గిరిగుట్ట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎం.అంజయ్య నిందితునిపై వచ్చినటువంటి ఆరోపణలను చదివి వినిపించి ఆ తర్వాత అతడిని బాండ్‌పై విడుదల చేశారు. భవిష్యత్‌లో కూడా డీసీపీకి ఉన్న అధికారాలను బట్టి పాత, అనుమానితులను సత్ప్రవర్తన కోసం బైండోవర్ చేయనున్నట్టు తెలిపారు.

బస్సు ఢీ.. ఇద్దరికి గాయాలు

జీడిమెట్ల,మార్చి 17(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఓ ప్రైవేట్ కంపెనీ బస్సు బీభత్సం సృష్టించింది. బైక్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొనగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సీసీ ఫుటేజ్ ఆధారంగా జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన చంద్రశేఖర్, లక్ష్మీనారాయణలు టీఎస్ఐఐసీ మూలమలుపు వద్ద బైక్‌ను మలుపుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బస్సు వీరిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో గాయపడిన లక్ష్మీనారాయణ పరిస్థితి విషమంగా ఉంది. చంద్రశేఖర్‌కు గాయాలు కాగా మరో వ్యక్తి బాలకృష్ణకు స్వల్పగాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ అస్సదుల్లాఖాన్‌పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రదేశాల్లో ఇద్దరు అదృశ్యం

- భర్తకు మెసేజ్ పెట్టి భార్య.. డ్యూటీకి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



మీనాక్షి



బాబన్

గాజులరామారం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటనలు సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగాయి. ఇంటికి రాను నన్ను మర్చిపో అని భర్త ఫోన్‌కు మెసేజ్ పెట్టి ఇంటి నుంచి బయటికి వెళ్లిన భార్య అదృశ్యమైంది. డ్యూటీకి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం సాయిబాబానగర్ పాండుబస్తీకి చెందిన రమేష్, మీనాక్షి(32) భార్యాభర్తలు. రమేష్ బయట ప్రైవేటు ఉద్యోగి కాగా మీనాక్షి ఇంట్లోనే ఉంటూ కూరగాయల వ్యాపారం చేస్తుండేది. ఈ నెల 16న పిల్లలకు చెప్పి ఇంటి నుంచి బయటకు బయటకు వెళ్లిన మీనాక్షి భర్త ఫోన్ నంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టింది. రాత్రి 11కు భర్త ఫోన్‌కి నేను ఇంటికి రాను నన్ను మర్చిపో అని మెసేజ్ పెట్టి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుంది. భర్త తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అలాగే సూరారం మరాఠీబస్తీకి చెందిన డీసీఎం డ్రైవర్ బాబన్(48) ఈ నెల 6న డ్యూటీకని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం కుమారుడు శుభం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు